ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 365

పేజీలు : 5 వెల రూ. 2/-

ఆదివారం
24 ఏప్రిల్ 2026

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

- చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన
- కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి
- అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం



2 లో

### భద్రత, వాణిజ్య, సాంకేతిక
## రంగాల్లో సహకారం

- అమెరికాకు భారత్ కీలక భాగస్వామి
- ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు



2 లో

# యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

- వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ
- గోదావరి పుష్కరాలకు వేయికోట్లు..
- జూనియర్ కాలేజీల్లో మహద్యాహ్న భోజనం
- గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం
- కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు
- తెలంగాణ కేబినేటీ కీలక నిర్ణయం



2 లో

## హరీష్ రావువి పగటి కలలు

- అధికారంలోకి రావడం కల్ల - మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు
- ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన
- అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్..

2 లో




## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

- దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు
- ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి..

2 లో



# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

- ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరు
- పాత ఇందిరమ్మ ఇల్ల పూర్తికి నిధులు కేటాయింపు
- జూన్ 1న కొఠారి గ్రామంలో ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం..
- కేబినేట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పొంగులేటి

2 లో



# యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

**ఏఎం న్యూస్, యాదగిరిగుట్ట,మే23:**
యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ



వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రి మండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

**ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,మే24:**
దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ంఊఃజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆనిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలినసమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబ సభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు చూసుకోవాలి. రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసుకోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది. 2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో కవిత అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిదిగా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011లో మిస్‌అయింది కావున, 2013లో వచ్చిన హోంశాఖ యాంటీ -ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ- ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

**ఏఎం న్యూస్, హైదరాబాద్,మే24:**
రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించాం. జూన్ 1వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులంతా అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం అని మంత్రి పొంగులేటి తెలిపారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాల న్నింటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని క్యాబినెట్ నిర్ణయించింది. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్ల నిధులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్లు మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖీఆఃూలో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పాఠశాలలతో పాటు అన్ని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకూ ఉదయం అల్పాహారంతో పాటు పాలు అందించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని డిసిఎంఎస్‌లను మార్క్ ఫెడ్లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ హాకాలో విలినం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. దావోస్‌లో ఈ పాలసీని లాంఛనంగా ఆవిష్కరించాం అని తెపిపారు. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలతో పాటు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఇన్నోవేషన్ మీద ఎక్కువ ఫోకస్ పెడతాం. రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ పాలసీలో మార్పు తీసుకొస్తున్నాం. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ పాలసీ ఉపయోగపడుతుందని మంత్రులు వివరించారు.

## భద్రత, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో సహకారం

**ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,మే24:**
భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వైట్‌హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరఫున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవాతీర్థ్ లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుం టున్నానంటూ చమత్కరిం చారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

# తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

## వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు
## మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పున పరిహారం
## పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటీ సమీక్ష

**ఏఎం న్యూస్, హైదరాబాద్,మే24:**
రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. షుగర్, బీపీ పేషెంట్లు మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తులు కాకుండా తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలి. ఆల్కాహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఎండాకాలంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం లాంటివి శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల్లోపే ముగించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించగానే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణం చెంది.. బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాలు పోవచ్చు.

### నూతన చైర్మన్ కొల్లిపర నాగరాజుకి

## శుభాకాంక్షలు తెలిపిన పూడి రవి..

**ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :**



తెలంగాణ బస్తిల జాయింట్ యాక్షన్ కమిటీ (టీబిజెఎసి) జూబ్లీహిల్స్ నియోజకవర్గం కు కొల్లిపర నాగరాజు ను నూతన చైర్మన్ గా నియమించారు. ఈ పదవి వారికి వచ్చినందున వారి మిత్రుడు, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాజకీయాల్లో చురుకు గా ఉంటాడని పేరు తెచ్చుకున్న పూడి రవి కళ్యాణ్( జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు) వారిని (నాగరాజు) మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మా నించి వారికి వచ్చిన నియామక పత్రం ను ముద్దాడి, వారికి( నాగరాజు) హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవి కళ్యాణ్ మాట్లాడుతూ నా మిత్రుడికి ఈ పదవి రావడానికి సహకరించిన గోసుల శ్రీనివాస్ యాదవ్ (తెలంగాణ బస్తి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్) ఎర్రోళ్ల శీనన్న (మాజీ కార్పొరేషన్ చైర్మన్), సళ్ళ శ్రీనివాస్ యాదవ్ (తెలంగాణ బస్తి జాయింట్ కమిటీ వైస్ చైర్మన్) , అమ్మాజీ ( గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి అధ్యక్షురాలు) నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక (మహిళా నాయకురాలు), శ్రావణ్, నవీన్ పటేల్, షబ్బీర్, ప్రసాద్ చౌదరి, శ్రీనివాస్ రెడ్డి, ఇస్మాయిల్, నాగు, వాసు, పాల్గొన్నారు.

## సిద్ది వినాయక ప్రాపర్టీ డెవలపర్స్ శ్రీపురం సన్నిధి 50 ఎకరాల HMDA RERA ఆమోదిత ప్రాజెక్ట్ స్వర్ణగిరి బ్రోచర్ ఆవిష్కరణ

**ఏ ఎం న్యూస్ ఓయూ:**





శ్రీపురం సన్నిధి 50 ఎకరాల HMDA RERA ఆమోదిత ప్రాజెక్ట్ స్వర్ణగిరి బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మా శ్రీ సిద్ది వినాయక ప్రాపర్టీ డెవలపర్స్ ఉప్పల్ భగాయత్ హైదరాబాద్‌లో సొంత భవనం 1వ అంతస్తులో మా చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కాసర్ల మహేందర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గుర్రం రఘుమా రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ దేవిరెడ్డి సత్తిరెడ్డి, ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్ శ్రీ లక్ష్మీపురం వేణు గోపాల్, బిజినెస్ కోచ్ శ్రీ శ్రావణ్ వర్మ మరియు అతిరథ మహారథులు & మా టీమ్ లీడర్లు మరియు మార్కెటింగ్ అసోసియేట్స్ మధ్యలో ఘనంగా నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన గ్యాంగ్ లీడర్ టీమ్ లీడర్ శ్రీ అరివిశెట్టి శ్రీనివాస్, సంతోషి, వనజ, డేవిడ్ రాజ్, నవీన్ గౌడ్, గణేష్, దేవరాజు కృపాకర్ రాజ , బండారి విశ్వం గౌడ్ తదితరులు మా గ్యాంగ్ లీడర్ టీమ్ పాల్గొన్నారు.

## హరీష్ రావువి పగటి కలలు

**ఏఎం న్యూస్, హైదరాబాద్,మే24:**
ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

**ఏఎం న్యూస్, హైదరాబాద్,మే24:**




దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ంఐ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు. భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.

### ఘనంగా ప్రారంభమైన

# వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు

**- దాదాపు 530 మంది క్రీడాకారులతో జిల్లా స్థాయి పోటీలు**




ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ఎస్ ఎల్ వి ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని పోటీలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రావు, వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్‌తో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, కోచ్‌లు, నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వికారాబాద్ జిల్లా నుంచి రికార్డు స్థాయిలో క్రీడాకారులు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధికి అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, కార్యదర్శి యు.వి.ఎన్. బాబు, సభ్యులు సుబ్బారెడ్డి, విజయ్‌కుమార్, పీవీఎల్ కుమార్, ఏ.వి. రమణా రెడ్డిలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే అకాడమీ నిర్వాహకులు, చీఫ్ కోచ్ జయంత్, ఎం. రామరాజు, సాయితేజలను అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ, ప్రోత్సాహం అందించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారి సమిష్టి కృషి ఫలితంగానే ఈ ఏడాది ఏకంగా 530 మంది క్రీడాకారులు ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. ఈ స్థాయిలో పాల్గొనడం వికారాబాద్ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ పట్ల పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ యువ క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చి దిద్దేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, క్రీడాకారులు విజయం సాధించాలనే లక్ష్యంతో తమ ప్రతిభను కనబరిచారు. అధికారులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు.

# కూకట్‌పల్లి ఏవిబిపురం భూదాన్ బాధితులకు మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ భరోసా

**అర్హులైన పట్టాదారులకు ఇళ్ల స్థలాలు ఇప్పించే దిశగా చర్యలు..**




ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : కూకట్‌పల్లి ఏవిబిపురంలోని భూదాన్ భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బాధిత కుటుంబాలు చేపట్టిన ధర్నాకు ఎంపీ ఈటల రాజేందర్ మద్దతు తెలుపుతూ భరోసా ఇచ్చారు. ఆచార్య వినోబా భావే భూదాన్ ఉద్యమంలో భాగంగా నిలువ నీడలేని నిరుపేదలకు ఒక్కో కుటుంబానికి 60 చదరపు గజాల చొప్పున సుమారు 850 కుటుంబాలకు స్థలాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. దశాబ్దాలుగా చిన్న చిన్న స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న పేదలకు ప్రభుత్వం ఇబ్బందులు కలిగించకుండా, వారికి పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడి భూదాన్ బోర్డు భూమికి, ఐడిపిఎల్ పరిశ్రమకు సంబంధించి ఉన్న స్థల వివాదాన్ని పరిశ్రమల మంత్రి కుమార స్వామితో మాట్లాడి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడి పేద ప్రజల స్థలం విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని అలాగే జిల్లా కలెక్టర్ ద్వారా సంపూర్ణ సమాచారం తీసుకుని అర్హులైన పట్టాదారులకు స్థలాలు అందేలా చూస్తానని చెప్పారు. ఇప్పటికే ఇక్కడి పట్టాదారులు కోర్టుల చుట్టు తిరిగి, అలసిపోయి నానా అవస్థలు పడుతున్న బీద ప్రజల ఇబ్బందులను సాధ్యమైన తొందర్లో పరిష్కార మార్గం చూపుతానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. భూదాన్ భూముల సమస్యను మానవీయ దృక్పథంతో పరిశీలించి త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట మాజీ కార్పొరేటర్ మహేందర్, రాష్ట్ర నాయకులు ఎంజాల పద్మయ్య, జి శ్రీకర రావు, భూదాన్ బోర్డు కు చెందిన పలువురు పట్టాదారులు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లకు మద్దతు ప్రకటించిన జనసేన పార్టీ అధినేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద గత రెండు రోజులుగా నిరాహార దీక్ష నిర్వహిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కార్మికులు గుత్తేదారుల అసోసియేషన్ సభ్యులు మద్దతు కోరగా కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ కార్మికులను పరామర్శించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, వారి న్యాయపరమైన డిమాండ్లకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికులు ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న 31 రూపాయల రేటును 51 రూపాయలకు పెంచాలని, కార్మికుల కుటుంబాల భద్రత దృష్ట్యా 10 లక్షల నుండి 20 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం పెంచాలని, అలాగే కార్మిక సంక్షేమానికి అవసరమైన ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ,తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శ్రమజీవుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని, అలాంటి కార్మికుల సంక్షేమం కోసం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కాకుమాను లక్ష్మణ్ రావు , కొల్లా శంకర్, బోగాదివెంకటేశ్వరావు, వేముల మహేష్ , పోలెబోయిన శ్రీనివాస్ , మాధవ్ రావు, బడే విశ్వేశ్వర్ రావు, చిట్టిబాబు జనసైనికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### కూకట్పల్లి సమస్యల పరిష్కారం కోసం

## మంత్రి పొంగులేటిని కలిసిన బండి రమేష్..

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్పల్లి నియోజకవర్గానికి సంబంధించి సమస్యల పరిష్కారం కోసం టి పి సి సి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సచివాలయంలో శనివారం కలిశారు. ముందుగా మంత్రికి పూల మొక్క ఇచ్చి శాలువాతో సన్మానించారు. నియోజకవర్గశీ పరిధిలోని వసంత నగర్ పరిధి (సర్వే నెంబర్లు 145, 163) ఐడిపిఎల్ వర్కర్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్ ఆర్ ఎస్ ఏ కాలనీలోని ఇళ్లు గత కొంతకాలంగా రిజిస్ట్రేషన్ చేయడం లేదని దీంతోపాటు గత సంవత్సర కాలంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్ల నిర్మాణానికి అనుమతులు సైతం అధికారులు ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కారణంగా స్థానికులు గత 40 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్న ప్రస్తుతం పర్మిషన్లు ఇవ్వకపోవడంతో స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి తాను స్వయంగా అధికారులతో మాట్లాడి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు బండి రమేష్ పేర్కొన్నారు.

## కూకట్పల్లిలో జరిగే బి.ఆర్.ఎస్ విస్తృత స్థాయి సమావేశ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారావు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



ఈనెల 25 న ఎన్. కె .ఎన్. ఆర్ గార్డెన్స్‌లో జరిగే బిఆర్ఎస్ పార్టీ కూకట్పల్లి నియోజకవర్గం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి సంబంధించి ఏర్పాట్లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరాలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎండలు తీవ్రత కారణంగా ఉదయం 9 గంటలకే కేటీఆర్ వస్తున్నారని నాయకులు, కార్యకర్తలు కూడా దీన్ని గమనించి త్వరగా సమావేశ ప్రాంగణానికి రావాలని అన్నారు. ఎక్కడా కార్యకర్తలకు, నాయకులకు ప్రజలకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు, మంచినీరు, మజ్జిగ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వస్తారని అన్నారు.

### పోలీస్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్

## విజేతలను అభినందించిన డీజీపీ

ఏ ఎం న్యూస్, ఓయూ:





ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఈ నెల 9 నుంచి 13 వరకు నిర్వహించిన '2వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ 2025-26' లో తెలంగాణ పోలీస్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయి పోటీల్లో నైపుణ్యం, పట్టుదల,అత్యుత్తమ క్రీడా స్ఫూర్తిని చాటిన రాష్ట్ర పోలీస్ క్రీడాకారులు ఒక స్వర్ణం, నాలుగు రజతాలు, ఏడు కాంస్యాలతో కలిపి మొత్తం 12 పతకాలను కైవసం చేసుకుని రాష్ట్రానికి కీర్తిప్రతిష్టలు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో విజేతలుగా నిలిచిన క్రీడాబృందంశుక్రవారం డీజీపీ సి.వి. ఆనంద్ను తనకార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా డీజీపీ విజేతలను ప్రత్యేకంగా అభినందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈజాతీయపోటీల్లో మధ్యప్రదేశ్లోని భోపాల్లో నిర్వహించిన 'ఇండియాఓపెన్ షూటింగ్ కాంపిటీషన్' మాస్టర్స్ కేటగిరి రైఫిల్ అండ్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్న ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఇన్స్పెక్టర్ బి. జేమ్స్ బాబు కూడా ఈ సమావేశంలో డీజీపీని కలిశారు. ఈ కార్యక్రమంలో ఐజీపీ, స్పోర్ట్స్, డాక్టర్ గజరావు భూపాల్, క్లస్టర్ టీమ్ మేనేజర్ మరియు డీసీపీ జి. నరసింహారెడ్డి, తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ మరియు డీఎస్పీ డాక్టర్ ఆర్.వి. రామారావు, 13వ బెటాలియన్ టీజీఎస్పీ ఆర్ఎస్ఐ మరియు టేబుల్ టెన్నిస్ కోచ్ ఎ. అశోక్లు పాల్గొన్నారు.

### కెటిఆర్, ఎమ్మెల్యే కృష్ణారావు

# మాయమాటలకు మోసపోకండి ఆత్మ విమర్శ చేసుకోండి

**- బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి హితవు..**

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను మరోసారి మాయమాటలు చెప్పి మోసం చెయ్యడానికి కేటీఆర్, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రంగం సిద్ధం చేస్తున్నారని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన కూకట్పల్లి ఎన్.కె.ఎన్.ఆర్. గార్డెన్‌లో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం అందుకు నిదర్శనమని అన్నారు. గతంలో అనేక సందర్భాల్లో ముఖ్యంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఎన్నిక ముందు అనేక బహిరంగ సభల్లో తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు ఇస్తామని కెటిఆర్ చెప్పిన మాటలు వాస్తవం కాదా అని గుర్తుచేశారు. కెటిఆర్ మాటలకు ఆహా ఓహో అంటూ వత్తాసు పలికిన ఎమ్మెల్యే కూడా అవే మాయమాటలు చెప్పి తెలంగాణ ఉద్యమంలో వీరోచిత పోరాటం చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకర్తలకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. పప్పులో కరివేపాకును వేసినట్లు ఎన్నికలు సమీపిస్తున్నా యంటే కార్య కర్తలను వాడుకుని వదిలెయ్యడమే కెటిఆర్, ఎమ్మెల్యే కృష్ణారావు నైజం అని తీవ్రంగా విమర్శించారు. కార్య కర్తలను రెచ్చగొట్టడం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దిట్ట అని పేర్కొన్నారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మాధవరం కృష్ణారావు ఆయన, ఆయన కుమారుడు దిన దినం అభివృద్ధి చెందుతూ కోట్లకు పడగలెత్తారని, ఎమ్మెల్యేను నమ్ముకున్న కార్యకర్తలకు నామినేటెడ్ పదవులుగానీ, అభివృద్ధి చెందిన దాఖలాలు గానీ ఎక్కడా లేవని తీవ్రంగా విమర్శించారు. త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరే షన్ ఎన్నికల్లో మరోసారి కార్యకర్తలను మోసం చేసి మాయమాటలు చెప్పేందుకు మరోసారి వస్తున్నారని అన్నారు. ముఖ్యంగా కూకట్పల్లి నియోజక వర్గంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కెటిఆర్, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెప్పే మాయమాటలకు మోసపో వద్దని, ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి హితవు పలికారు.



## ఉస్మానియా యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**- ఏబీవీపీ ఓయూ ప్రెసిడెంట్ గెల్లు శేఖర్ డిమాండ్..**



ఏ ఎం న్యూస్, ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీలో అధ్యాపకుల నియామకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఓయూ ఏబీవీపీ ప్రెసిడెంట్ గెల్లు శేఖర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిస్థితిలో పెద్దగా మార్పులు చోటుచేసుకోలేదన్నారు.రెండు ప్రభుత్వాలు మారినా యూనివర్సిటీల అభివృద్ధి, అధ్యాపక నియామకాల విషయంలో స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకర మని విమర్శించారు.ఇటీవల రేవంత్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి యూనివర్సిటీలో రిక్రూట్మెంట్ చేపడతామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి నోటిఫికేషన్ విడుదల కాకపోవడం విద్యార్థులను నిరాశకు గురిచేస్తోందన్నారు.ఉస్మానియా యూనివర్సిటీలో మొత్తం సుమారు 1268 ప్రొఫెసర్ పోస్టులు ఉండగా ప్రస్తుతం కేవలం 312 మంది రెగ్యులర్ ప్రొఫెసర్లతోనే యూనివర్సిటీ నడుస్తోం దని పేర్కొన్నారు. అధ్యాపకుల కొరత కారణంగా పరిశోధన రంగం తీవ్రంగా దెబ్బతింటోందని, విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. అనేక విభాగాలు గెస్ట్ ఫ్యాకల్టీ ఆధారంగా నడుస్తుండటం వల్ల విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు సరైన గైడెన్స్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఉస్మానియా యూనివర్సిటీతో పాటు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని గెల్లు శేఖర్ డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆలస్యం చేయకుండా రిక్రూట్మెంట్ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఘనంగా రాందేవ్ రావ్ ఆసుపత్రి సీఈవో డాక్టర్ యోబు జన్మదిన వేడుకలు

**- వేడుకల్లో పాల్గొన్న కూకట్‌పల్లి విలేకరులు..**

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్‌పల్లి రామదేవరావు హాస్పిటల్ సీఈఓ ఎన్ యోబు పుట్టినరోజువేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా కూకట్పల్లి విలేకరులు తెల్ల హరికృష్ణ, రంజిత్, రాకేష్, సత్య, మారుతి, అనిల్, మహేష్ తదితరులు యోబుని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి, పూల మొక్కని అందించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### భూదాన్ భూముల సమస్యపై

## ఎంపీ ఈటెల రాజేందర్‌కి పట్టాదారుల వినతి

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఆచార్య వినోబాభావే పురం (ఏవీబీపురం)లో భూదాన్ బోర్డుకు సంబంధించిన స్థలాలను మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్థానిక ప్రజలతో కలిసి ఎంపీకి భూదాన్ భూముల సమస్యలను వివరించారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ భూదాన్ బోర్డుకు సంబంధించిన భూములను పేద, మధ్యతరగతి ప్రజలకు అమ్మి డబ్బులు వసూలు చేశారని, ఇప్పుడు ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే సమయంలో అవి ఐడిపిఎల్‌కు చెందిన భూములని చెబుతూ ఐడిపిఎల్ సిబ్బంది, సీఐఎస్ఎఫ్ సిబ్బంది అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించి మోసపోయామని తమ గోడును ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కూకట్‌పల్లిలో సుమారు 26.6 ఎకరాల భూదాన్ భూమి ఉందని, పేద, మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని చెప్పి తప్పుడు హామీలు ఇచ్చారని ఆరోపించారు. ఈ సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి డబ్బులు తీసుకుని ప్రజలను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా స్థానిక దళితులు, పేద, మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉన్నా ప్రభుత్వాలు జోక్యం చేసుకుని పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు స్థానిక దళితులు,ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఈనెల 25న జరిగే బి.ఆర్.ఎస్

## విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయండి

**- కూకట్పల్లి కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా...**



ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : ఈనెల 25న కూకట్ పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంను విజయవంతం చేయాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా పిలుపునిచ్చారు. కూకట్ పల్లి హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ఈనెల 25 సోమవారం నాడు ఉదయం 9 గంటలకు యన్.కె.యన్.ఆర్ గార్డెన్‌లో జరుగు బిఆర్‌యస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యే సమా వేశానికి అతిథిలుగా ఎమ్మెల్సీలు కె. నవీన్ కుమార్, సంబిపూర్ రాజు, పలువురు ప్రజాప్రతినిధులు రాష్ట్ర నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు. కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలు, నాయకులు, మహిళా నాయకులు యువ నాయకులు అనుబంధ సంస్థల నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా సతీష్ అరోరా విజ్ఞప్తి చేశారు.

## ఎస్సీ మోర్చా మీడియాకు కన్వీనర్‌గా భానోత్ జ్యోతి నియామకం



ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ : భారతీయ జనతా పార్టీ కి కష్టపడిన కార్యకర్తలకు గుర్తించి, వారికి వివిధ హోదాల పదవులకు పేర్లను ప్రకటిస్తూ వస్తుంది. ఆ క్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకురాలు, ఏ కార్యక్రమం (బిజెపి పార్టీకి సంబంధించిన) ఉన్న ముందుండి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తన వంతు పాత్ర పోషించే, అక్క అని పిలిస్తే నేనున్నా అని పలికే బానోత్ జ్యోతి కి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్టీ మోర్చా మీడియా కో ,కన్వీనర్ గా ప్రకటించింది. ఈ సందర్భంగా బానోతు జ్యోతి మాట్లాడుతూ నాకు ఈ పదవి బాధ్యతను పెంచింది అని అన్నారు, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నవీన్, రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు నేనావత్ రవి నాయక్, జిల్లా అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి ఆశీస్సులతో నా పదవికి న్యాయం చేస్తానని అన్నారు. గిరిజన సోదర, సోదరీమణుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు, అభ్యున్నతికి నా వంతు కృషి చేస్తానని , గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తాను అని ఎ.ఎం.న్యూస్. మీడియా ద్వారా తెలుపుతున్నాను అని అన్నారు. రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా ధన్యవాదాలు అని అన్నారు.